ఎయిరిండియా విమానం నుంచి ప్రయాణికుడి దించివేత

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఢిల్లీ బయలుదేరిన విమానం నుంచి ఓ ప్రయాణికుడిని భద్రతాధికారులు కిందకు దించేశారు. బుధవారం సాయంత్రం సంఘటన జరిగింది. బెంగళూరు నుంచి ఢిల్లీకి సాయంత్రం 6గంటలకు ఎయిరిండియా ఎ1-2820 విమానం బయలుదేరాల్సి ఉంది. అప్పటికే ప్రయాణికులంతా విమానంలో కూర్చున్నారు. మరికొన్ని క్షణాల్లో విమానం టేక్ఆఫ్ కావాల్సి ఉంది. ఒక్కసారిగా భద్రతాదళాలు విమానంలోకి ప్రవేశించి ఓ ప్రయాణికుడిని వెంట తీసుకెళ్లాయి. ఆ తర్వాత విమానం యథాతథంగా బయలుదేరింది. ఇదే విషయాన్ని ఎయిరిండియా సంస్థ అంగీకరించినా సమగ్ర సమాచారం వెల్లడించేందుకు నిరాకరించింది. ఘటనకు సంబంధించి సమాచారం ఉందని ఓ ఎయిరిండియా సంస్థ అధికారి గురువారం ప్రకటించారు. ఎటువంటి వివరాలను బహిరంగ పరచలేమన్నారు. ప్రయాణికుడిని కిందకు దించేందుకు తగిన ఆధారాలు ఉంటాయని, అందుకు నిర్దిష్టమైన కారణాలు తెలిసినా చెప్పలేమని, కొన్ని అంశాలు బహిరంగం చేయడం సాధ్యపడదన్నారు.

నాలుగు జిల్లాల్లో లోకాయుక్త దాడులు

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నారనే ఆధారాలతో నాలుగు జిల్లాల పరిధిలో గురువారం లోకాయుక్త దాడులు జరిపింది. కోలార్‌లో తాలూకా సర్వే అధికారి సురేష్ బాబు, సురపుర తాలూకా వైద్యాధికారి రాజీవ్‌వెంకటప్ప నాయక, కర్ణాటక జలమండలి దావణగెరె అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంటీ రవితో పాటు బెంగళూరు జలమండలి అసిస్టెంట్ ఇంజనీర్ జి. శ్రీనివాసమూర్తి నివాసాలు, కార్యాలయాలు, వారి సమీప బంధువుల నివాసాలపై లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. కీలకమైన ఆస్తుల పత్రాలను, నగదు, బంగారాన్ని గుర్తించినట్లు ప్రకటించారు.

రబీలోనూ అన్నదాతకు కష్టాలే..!

- కొనేవారు లేక కల్లాల్లోనే వరి పంట
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



కొనుగోలుదారుల కోసం రోడ్లపై పంటను పెట్టుకుని ఎదురుచూస్తున్న రైతులు

కంప్లి, మే 8(ఆంధ్రజ్యోతి): భూమిని నమ్ముకున్న రైతన్నకు ప్రతి యేటా కష్టాలు తప్పడం లేదు. సమాజంలో చిన్నపాటి వ్యాపారం చేసుకునేవారు సుఖసంతోషాలతో జీవనం గడుపుతున్నారు. కానీ భూమిని నమ్ముకుని వందలాది ఎకరాలు ఉన్న రైతు మాత్రం కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదు. మార్కెట్లో వ్యసాయానికి కావాల్సిన పనిముట్లు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. ప్రభుత్వాలు దేశానికి ఒక సైనికుడు ఒక రైతు ఎంతో ముఖ్యమని కేవలం అవి మాట్లాడేందుకే పరిమితమయ్యాయి. రైతు కుటుంబ రావు మాట్లాడుతూ కంప్లి తాలుకాలో వరి గింజలకు ప్రభుత్వాలు గిట్టు బాటు రేట్లు ఇవ్వకపోవడంతో నష్టపోతున్నాం. పొలాల్లో పండించిన పంటలను పట్టణాలకు చేరుస్తున్నారు. రైతు సేద్యం చేసి పంటలు పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఎండనక వాననక పగలనక రాత్రనక పొలాల్లో ఎన్నో విషపూరితమైన జీవులను లెక్కచేయకుండా తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పంటలు పండిస్తున్న రైతన్నకు ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమవుతున్నాయి. కేవలం ఎన్నికల సమయంలో మాత్రం తమ ప్రభుత్వం ఏర్పడితే రైతులు ఆదుకుంటాం. గిట్టుబాటురేట్లు కల్పిస్తామని హామీలు ఇచ్చేందుకు మాత్రమే పరిమితమయ్యారు. గెలిచిన అనంతరం రైతన్నకు ఏమి జరిగినా తెలిసీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఖరీఫ్, రబీ పంటల్లో వాతావరణం మార్పు, తెగుళ్ల వల్ల వేసిన పంటలు దిగుబడులు తగ్గిపోయి పంటల కోసం తెచ్చిన రుణాలు కట్టలేక రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. రబీ పంటలో అకాల వర్షాల వల్ల రైతన్న వరి పంటలు పూర్తిగా నేలకొరిగి పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా పోయాయి. దీనికి తోడు కొనుగోలుదారులు లేకపోవడంతో చిన్నపాటి వ్యాపారాలు వారికి ఇష్టమొచ్చినట్లుగా వ్యాపారం చేస్తూ రైతన్నని మరింత కష్టాల్లోకి నెట్టుతున్నారు. కేవలం సొంత రైతులు మాత్రమే అంతంతగానే సరిపోయింది. కౌలు రైతులకు నష్టాలే మిగిలాయి. ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు దిగుబడులు వచ్చేవి, కేవలం 25 నుంచి 35 బస్తాలు దిగుబడులు వచ్చాయి. వచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు మార్కెట్లో కొనుగోలుదారులు లేక కొనుగోలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని హామీలకు పరిమితమైంది. ఇంతవరకు ప్రారంభం కాపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోసుకొచ్చిన ధాన్యం పొలాల్లోనే ఉంచే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

- ఏక్షణంలో ఏమైనా జరగొచ్చు
- ప్రాజెక్టుల వద్ద బందోబస్తు పెంపు
- నేడు బెంగళూరులో తిరంగా యాత్ర: డీసీఎం

హై అలర్ట్..!

అన్ని మసీదుల్లో ప్రత్యేక నమాజు -మంత్రి జమీర్



కేరళ రాష్ట్ర సరిహద్దులో భద్రత

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పహాల్గాం ఉగ్రదాడి తర్వాత యుద్ధవాతావరణం నెలకొంది. మన సైన్యం పాకిస్తాన్‌పై నిరంతరంగా దాడులు చేస్తున్న తరుణంలోనే కేంద్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో హైఅలర్ట్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భారీ ప్రాజెక్టుల వద్ద బందోబస్తును పెంచినట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. మండ్య జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మీడియాతో మాట్లాడిన సీఎం సిద్దరామయ్య కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిందన్నారు. ఎప్పుడు ఏదైనా జరగొచ్చని, అన్నింటికీ సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రధానంగా ప్రాజెక్టులు, విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద ఇప్పటికే బందోబస్తు పెంచామన్నారు. పాకిస్తాన్‌కు చెందిన పౌరులను సరిహద్దులు దాటించామని, అయితే మైసూరులో నివసించే వారు కోర్టును ఆశ్రయించారన్నారు. ఇంకా ఎంతమంది ఉన్నారనేది స్పష్టంగా తెలియదన్నారు

చిన్నస్వామి స్టేడియం చుట్టూ భద్రత

పాకిస్తాన్‌లోని రావల్పిండిలో ఉన్న స్టేడియం పేల్చివేసిన తరుణంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద బందోబస్తు పెంచారు. సుమారు 100మందికి పైగా పోలీసులను, గస్తీ వాహనాలను కేటాయించారు. బెంగళూరులోని ఇస్రో, డీఆర్‌డీఓ సహా ఐటీ, బీటీతో పాటు పలు ఎంఎన్‌సీ కంపెనీల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.

జిందాల్ విమానాశ్రయానికి భద్రత పెంపు



ఎయిర్‌పోర్టు వద్ద భద్రతా సిబ్బంది పహారా

కంప్లి(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం ప్రారంభం కావడంతో జేడబ్ల్యూఎస్ జిందాల్ ఎయిర్‌పోర్టుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న అన్ని డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయడంతో క్యూఆర్‌టీ బృందం ద్వారా గట్టి భద్రతను చేపట్టారు. అన్ని సున్నితమైన ప్రదేశాలలో కుక్కలతో తనిఖీని నిర్వహించారు.

నేడు తిరంగాయాత్ర

ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతున్న సైనికులకు మద్దతుగా ప్రభుత్వం తిరంగా యాత్రకు పిలుపునిచ్చింది. ఇదే విషయాన్ని డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరులో ప్రకటించారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు కేఆర్ సర్కిల్‌లో ప్రారంభమై చిన్నస్వామి స్టేడియం వద్దనున్న గాంధీ విగ్రహం దాకా సాగనుందన్నారు. జాతీయ జెండా చేతబట్టుకుని జరిగే యాత్రలో అందరూ పాల్గొనవచ్చన్నారు. విధానసౌధ ఎదురుగా సైనికులకు గౌరవం సమర్పిస్తామన్నారు.

బెంగళూరు నుంచి 29 విమానాలు రద్దు

పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నేపథ్యంలోనే బెంగళూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే దేశీయ విమానాలను రద్దు చేశారు. పంజాబ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు నిత్యం సంచరించే విమానాలను రద్దు చేసినట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది.

ఆలయాల్లో పూజలు

ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రమూకలను కట్టడి చేస్తున్న సైన్యానికి మంచి జరగాలని రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలకు ఆదేశించారు. దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి ఇందుకు ప్రత్యేకమైన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సైన్యం కోసం ప్రత్యేక పూజలు జరిపేలా సూచించారు. పలు దేవాలయాల్లో గురువారం పూజలు చేశారు. కాగా అన్ని మసీదుల్లోనూ శుక్రవారం ప్రత్యేకంగా నమాజు చేసేలా రాష్ట్ర గృహనిర్మాణశాఖా మంత్రి జమీర్‌అహ్మద్ సూచించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమవుతున్న తరుణంలోనే మూడు భద్రతా బృందాలకు మంచి జరిగేలా ప్రార్థనలు చేయాలని సర్క్యులర్‌ను విడుదల చేశారు.



భారత సైన్యానికి మద్దతుగా అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రజలు



మల్లేశ్వరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు



జయనగరలోని ఆలయంలో పూజలు



నారాయణపుర ప్రాజెక్టు వద్ద పోలీసులు, ఇంజనీర్ల బందోబస్తు

సరిహద్దులు, ప్రాజెక్టుల వద్ద నిఘా!

కేంద్రప్రభుత్వ సూచనలకు అనుగుణంగా రాష్ట్ర సరిహద్దులు, ప్రాజెక్టుల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. నారాయణపుర ప్రాజెక్టు వద్ద మఫ్టీలో పోలీసులు, ఇంజనీర్‌లు ఉద్యోగులు బందోబస్తు చర్యలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన కేఆర్ఎస్, ఆల్మట్టితో పాటు అన్ని ప్రాజెక్టుల వద్ద బందోబస్తు పెంచారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో అత్యవసరంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కేరళ రాష్ట్రం నుంచి ప్రవేశించేందుకు మార్గాలుగా ఉండే చామరాజనగర్, మంగళూరు పరిధిలో చెక్‌పోస్టులు వెలిశాయి. అదే తరహాలోనే మహారాష్ట్ర నుంచి వచ్చే మార్గంతో పాటు గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోనూ భద్రత పెంచారు. ప్రధానంగా తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర చెక్‌పోస్టులపైనే ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

మాట వినకపోతే..

మర్డర్..!



- రగులుతున్న ప్రతీకారం
- రాష్ట్రంలో పెరుగుతున్న హత్యలు
- ఏడాదికి వెయ్యి మందికిపైగానే బలి
- రెండున్నరేళ్లలో 2,800 హత్య కేసులు
- భూవివాదాలు, వివాహేతర సంబంధాలు..
- ఆందోళన కలిగిస్తున్న భర్తను చంపిన ఉదంతాలు

బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఆటవిక సమాజంలో ప్రతీకారం తీర్చుకునేందుకు హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకునేవారు. అయితే ఆధునిక సమాజం 21వ శతాబ్దంలో ఉన్నత విద్య చదివినవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. చట్టం, న్యాయం గురించి మారుమూల పల్లెవాసులకు సైతం అవగాహన పెరిగింది. రోజూ పత్రికల్లో భిన్నమైన నేరాలు, హత్యలు చదివి అర్థం చేసుకోవడం, చర్చించుకునే వారు పెరిగారు. హత్యకు కుట్ర పన్నిన భాగస్వామ్యులైన నేరుగా ప్రమేయం ఉన్నా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుబడతామని తెలుస్తున్నా కాస్త ఆలోచించకుండానే ఎంతటికైనా సై అంటూ ముందుకెళ్తున్నారు. ఆ ప్రతీకారం నెత్తురోడేలా చేస్తోంది. వివాహేతర సంబంధాలు, ఆస్తి వివాదాలు, భూతగాదాలు, హత్యలు ఎక్కువగా ప్రేరేపిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఏటా వెయ్యికిపైగా హత్యలు కొనసాగడం నాగరిక సమాజంలో భయాందోళనకు కారణమవుతోంది. దీనిపై పోలీసుశాఖ ప్రత్యేకమైన నిఘా పెంచాలని భావిస్తోంది.

రాష్ట్రంలో చోరీలు, దాడులు, దోపిడీల వంటి నేరాలు వేలసంఖ్యలో జరుగుతుంటాయి. దొంగతనమే వృత్తిగా భావించేవారు ఎన్నిసార్లు జైళ్లకు వెళ్లినా బయటకు వచ్చి అదే నేరప్రవృత్తిని కొనసాగిస్తున్నారు. వారికంటే డ్రగ్స్‌కు బానిసలుగా మారినవారు అప్పటికప్పుడు దేనికైనా తెగించేలా వ్యవహరిస్తున్నారు. చివరకు అడ్డు వస్తే హతమార్చేందుకు వెనుకాడడం లేదు. వీటి కంటే ఆస్తి వివాదాలు, వివాహేతర సంబంధాలతోనే ఎక్కువహత్యలు జరుగుతున్నాయి. ఇలా ఏటా 1200కుపైగా హత్యలు చోటు చేసుకుంటున్నాయి. 2023లో 1294 హత్య కేసుల్లో 1217 కేసులను పోలీసులు చేధించారు. మిగిలిన 77 కేసులు రెండేళ్లుగా ఇంకా తేలలేదు. 2024లో 1207 హత్యకేసుల్లో 237 కేసులకు సంబంధించి పోలీసులు చేధించారు. మిగిలిన కేసుల్లో ఇంకా పూర్తిస్థాయిలో నిందితులను గుర్తించ లేకపోయారు. 2025 మార్చి చివరినాటికి (మూడు నెలలకు) 302 హత్యకేసులు నమోదయ్యాయి. ఈ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో రోజూ సరాసరిన మూడు హత్యలు కొనసాగినట్లు తేలింది. నెలకు వంద చొప్పున హత్యలు జరుగుతున్నాయి. హత్యకేసులను చేధించడంలోనూ, నిందితులను గుర్తించే ప్రక్రియలోనూ నిర్లక్ష్యంతోపాటు ముందుగానే బెదిరింపులకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నా, సకాలంలో స్పందించని కారణంగానే దారుణహత్యలు జరిగినట్లు తెలుస్తోంది. హత్యకేసులను చేధించడంలో విఫలమైన 128మంది పోలీసు అధికారులపైనా చర్యలు చేపట్టారు.

డ్రగ్స్ మత్తులో దుర్మార్గాలు..



కారణం	2023	2024	2025
అకస్మిక గొడవలు	112	104	90
సివిల్ వివాదాలు	86	81	22
ప్రతీకారం	54	59	12
యువతలో ఆవేశం	24	25	3
వివాహేతర సంబంధాలు	20	16	7
ప్రేమ వివాదాలు	19	25	8
అత్యాచారం, హత్యలు	11	8	4
వరకట్నపు చావులు	13	11	4

2023-24 గణాంకాలు

జిల్లా	కేసులు
బెంగళూరు	382
బెళగావి	174
విజయపుర	120
తుమకూరు	101
కలబురగి	87
హాసన్	80
దక్షిణకన్నడ	24
ఉడుపి	18
బీదర్	71
హుబ్బళ్ళి-ధారవాడ	45
మైసూరు	52
శివమొగ్గ	74
బాగల్కోటె	55
రామనగర	75
చిక్కమగళూరు	62
కోలారు	69
రాయచూరు	84
హావేరి	34

ఇతర జిల్లాల్లో 15లోపు హత్య కేసులు నమోదు అయ్యాయి.

చిన్నపాటి గొడవలే కారణాలు...

భూ వివాదాలు, అకస్మికంగా గొడవలు, ద్వేషం, వివాహేతర సంబంధాలు, యవ్వనంలో ఆవేశం, ప్రేమ, అత్యాచారం, హత్య, వరకట్నపు హత్యలు, వంటివి జరుగుతున్నాయి. చిన్నపాటి గొడవలు కూడా ఏకంగా హత్యలకు దారి తీస్తున్నాయి. ఇటీవల బెంగళూరులో బార్ అండ్ రెస్టారెంట్‌లలో మద్యం తాగే విషయంలోనూ, మత్తులో కాలు తగిలిందనే కారణంతో పలు హత్యలు జరిగాయి. దాయాదుల మధ్య ఆస్తి వివాదాలు, ఇరుగు పొరుగు కుటుంబీకులతో భూవివాదాలు పెరుగుతున్నాయి. గడిచిన నాలుగైదేళ్లుగా భర్తలను పథకం ప్రకారం హత్య చేసిన భార్యల ఉదంతాలు పెరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర డీజీపీగా వ్యవహరించిన ఓం ప్రకాశ్‌ను ఇంట్లోనే భార్య చాకుతో కిరాతకంగా పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం జాతీయస్థాయిలో చర్చకు కారణమైంది. ఇక సముద్రతీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో మతోన్మాదంతో హత్యలు జరుగుతున్నాయి. హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి హత్యకు విదేశాల నుంచి నిధులు వచ్చాయనే ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా సుహాస్‌శెట్టిని హత్య చేయాలని తీర్మానించుకున్నవారు దాదాపు రెండు నెలలుగా వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. హత్యకు రెండు రోజుల ముందు ఫైర్‌క్యాంప్ పార్టీ ఏర్పాటు చేసుకుని ఒక తీర్మానానికి వచ్చి హతమార్చారు. అంతకు ముందు అశోక్‌తోపాటు పలు హత్యలు కూడా మతానికి సంబంధించిన పట్టుదలతోనే కొనసాగినవే.

హత్యల నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా హత్యకేసులు పెరుగుతున్న తరుణంలో నియంత్రణకోసం రాష్ట్ర పోలీసులు ప్రత్యేక చర్యలకు సిద్ధమయ్యారు. వరుసగా గొడవలు అల్లర్లకు పాల్పడిన వారిపై రౌడీషీటర్‌లు తెరవడం, వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్‌తోపాటు వారిపట్ల నిఘా పెంచడం నిరంతరంగా కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. తరచూ ఒక ప్రాంతంలో ఓ వ్యక్తి గ్యాంగ్‌గా ఏర్పాటు చేసుకుని ఉంటే వారిని హెచ్చరించి కేసులు నమోదు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బీట్ వ్యవస్థను పెంపొందింపచేయదలిచారు. గ్రామీణప్రాంతాల్లో ఒక్కో గ్రామానికి ఒక కానిస్టేబుల్‌కు బాధ్యతలు అప్పగించి అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసే విధానం కొనసాగించాలని నిర్ణయించారు. జైళ్లనుంచి విడుదలైనవారిపై నిఘా ఏర్పాటు చేయదలిచారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.30	1,578.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,169	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	283	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.52	3.47

కార్మిక సంఘాలకు పంచాయతీ ఉద్యోగుల సంఘం మద్దతు



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, ఉద్యోగులు

బళ్లారి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వ్యాప్తంగా 20న కార్మిక ఉద్యోగుల ధర్నాకు గ్రామ పంచాయతీ ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్ ఎస్ బసవరాజు తెలిపారు. ఈమేరకు జిల్లా పంచాయతీ సీఈవో హరీష్ మహమ్మద్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి సరైన వసతులు లేవని, వారికి సౌకర్యాలు కల్పించలేదని బెంగళూరు నగరంలో 20న సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. తాలుకా అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునస్వామి, కురుగోడు ప్రధాన ఏజెన్సీ వీరసేనా రెడ్డి పాల్గొన్నారు.

నూతన ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న కర్ణాటక దళిత సంఘర్షణ కమిటీ రాష్ట్ర సంచాలకుడు ఓంకారప్ప

బళ్లారి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): నగరంలో శ్రీమతి సరళాదేవి సతీష్ చంద్ర అగర్వాల్ ప్రభుత్వ ప్రథమ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సోమనాథ్‌రావుకి ఆ కళాశాల ఆవరణంలో కర్ణాటక దళిత సంఘర్షణ కమిటీ రాష్ట్ర సంచాలకులు కప్పగల్ ఓంకారప్ప ఘనంగా సన్మానించారు. పోలప్ప, బెల్లకట్ట, శంకర్ చలపతి శేఖర్ పాల్గొన్నారు.

మమతకు డాక్టరేట్ ప్రదానం



కంప్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల వాణిజ్య విభాగాధిపతి మమతకు విజయనగర్ శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం పిలాసఫీలో డాక్టరేట్ ప్రదానం చేసింది. మమత డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియన్ బాండ్ మార్కెట్ యాస్ ఎక్స్‌టెన్సివ్ స్టడీ అనే పేరుతో రాసిన థీసిస్‌కు ఎకనామిక్స్ స్టడీస్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ భీమనగౌడ్ మార్గదర్శకత్వంలో విశ్వవిద్యాలయం ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమెకు కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ప్రతిభ చాటిన వసతి పాఠశాల విద్యార్థులు



యమనూరు



రవికుమార్



అంజలి

రాయచూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆశాపూర్ రోడ్డులో ఉన్న మొరార్జీదేశాయ్ ఎస్టీ వసతి పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. 625 మార్కులకు గాను యమనూరు 599, రవికుమార్ 577, అంజలి 571 మార్కులను సాధించి టాపర్‌లుగా నిలిచారు. విద్యార్థుల సాధన పట్ల గురువారం సాంఘిక సంక్షేమ శాఖ సబ్ డైరెక్టర్, వసతి పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

రేపు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

విజయనగరం (హొస్పేట), మే 8(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ఆరవ తరగతి ప్రవేశానికి అర్హత పరీక్షలు 9న నగరంలోని దీపాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలులో జరగనున్నాయి. పరీక్షలు సజావుగా జరగాలనే ఉద్దేశంతో కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధిత ప్రాంతంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఎంఎస్ పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సైబర్, కంప్యూటర్ దుకాణాలు మూసివేస్తున్నట్లు తెలిపారు. అనధికార వ్యక్తులు, సమూహాలను పరీక్ష కేంద్రం వద్దకు అనుమతించవని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

● మరో ముగ్గురికి గాయాలు

రాయచూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్టీపీఎస్ (రాయచూరు థర్మల్ పవర్ స్టేషన్) వద్ద వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తున్న సందర్భంలో విద్యుత్ షాక్ తగలడంతో ఓ కార్మికుడు మృతిచెందాడు. గురువారం తిమ్మారెడ్డి, హనుమేశ్, వీరేశ్, రంగప్ప అనే కార్మికులు నీటి ప్లాంట్‌ను శుభ్రం చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో తిమ్మారెడ్డి(28) అనే కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆర్టీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా కార్మికులు పని చేసే ప్రదేశాల్లో ఎలాంటి భద్రతలు లేకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.



రాయచూరు థర్మల్ పవర్ స్టేషన్

జిల్లా పురోగతిపై అదనపు సమాచారం ఇవ్వండి

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు వివిధ శాఖలు, ప్రాజెక్టుల కింద సాధించిన పురోగతిపై అదనపు సమాచారాన్ని అందించాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన ప్రాథమిక సమావేశానికి అధ్యక్షత వహించి కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి 21, 22వ తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, జడ్పీ ముఖ్య కార్యనిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. సరఫరా చేసిన తాగునీటిని క్రమం తప్పకుండా పరీక్షించడం, క్లోరినేషన్, ఇతర పనుల గురించి పూర్తి సమాచారం అందించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల పంపిణీ, పెండింగ్‌లో ఉన్న జాబితా, పంటల బీమా కోసం రైతుల నమోదు తదితర పూర్తి సమాచారాన్ని అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వివిధ కార్పొరేషన్లలో గంగా కళ్యాణ్ పథకాల పురోగతి గురించి సమాచారం అందుకున్న తర్వాత కలెక్టర్ మాట్లాడారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ పథకాన్ని ఎటువంటి ఆలస్యం లేకుండా అందజేయాలన్నారు. విద్యుత్ సరఫరా లేదా ఇతర సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలని ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి కలల ప్రాజెక్టు అయిన ఇందిరా క్యాంటీన్ల గురించి ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఇందిరా క్యాంటీన్ల ప్రాజెక్టు అయిన ఇందిరా క్యాంటీన్ల గురించి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఇందిరా క్యాంటీన్ల నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో పూర్తి చేయాలన్నారు. తాలూకాల్లో పనిచేస్తున్న ఇందిరా క్యాంటీన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణ గురించి పూర్తి సమాచారం అందించాలని ఆయన డీయూడీసీ అధికారులను ఆదేశించారు. శక్తి, అన్నభాగ్య, గృహలక్ష్మి, గృహజ్యోతి, యువనిధి పథకాలపై ప్రగతి నివేదికలను సమర్పించాలన్నారు. అర్హులైన ప్రజలకు పథకాలు అందించడంలో ఏవైనా సమస్యలు లేదా జాప్యాలు ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని అందించాలన్నారు. పన్ను వసూళ్ల వివరాలను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి అధికారులు అందరి నుంచి సమాచారం పొందిన తర్వాత జిల్లాలోని అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు వారం రోజుల్లోపు పూర్తి సమాచారాన్ని వ్యక్తగతంగా నమోదు చేయాలన్నారు. నిర్ణీత వ్యవధిలోపు కలెక్టర్ కార్యాలయానికి ప్రగతి నివేదికను సమర్పించడం తప్పనిసరి అన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబైర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, వ్యవసాయ శాఖ సంయుక్త డైరెక్టర్ సోమసుందర్, జీబీసీ ప్లానింగ్ ఆఫీసర్ వినోద్, జిల్లాపట్టణాభివృద్ధి సెల్ ప్లానింగ్ ఆఫీసర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

గర్భిణుల్లో పాదాల వాపు ప్రమాదకరం: డీహెచ్‌ఓ



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారిసిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): గర్భిణుల్లో పాదాలవాపు ప్రమాదకరమని, వైద్యులు సకాలంలో పరీక్షలు, చికిత్సలో ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి(డీహెచ్‌ఓ) రమేశ్‌బాబు సూచించారు. కొళగల్లు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో యూనివర్సిటీ వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్ కింద తమ పిల్లలకు టీకాలు వేయడానికి వచ్చిన తల్లులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళ గర్భవతి అయిన తర్వాత ఆమెను నిరంతరం వైద్యులు పర్యవేక్షించాలన్నారు. రక్తపోటు పరీక్ష తర్వాత ఏదైనా వ్యత్యాసం కనిపిస్తే సబ్ సెంటర్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు పరీక్షించాలన్నారు. రక్తహీనత కనిపిస్తే స్థానిక చికిత్స (ఐఎఫ్ఏ మాత్రలు, ఐరన్ సుక్రోజ్, రక్తమార్పిడి) మెరుగుపడకపోతే రోగిని తప్పకుండా నిపుణుడి వద్దకు పంపాలని సూచించారు. అవసరమైతే స్కానింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. మొదటి డెలివరీ శస్త్రచికిత్స ద్వారా జరిగితే మళ్లీ గర్భం దాల్చడాన్ని కనీసం 3 సంవత్సరాలుగా వాయిదా వేయడం తప్పనిసరి అన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలు, గర్భిణులను జాగ్రత్తగా చేసుకోవడానికి ఎవరూ లేకపోతే స్త్రీ, శిశు అభివృద్ధి శాఖకు సమాచారం ఇచ్చి సంరక్షణ కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో సిద్దమ్మనహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దివ్య, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, కమ్యూనిటీ ఆఫీసర్ ఎర్రిస్వామి, ఆరోగ్య భద్రతా అధికారి విజయ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్వేత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధలింగ దేశ గురు పట్టాభిషేకం



వేదికపై సిద్ధలింగ దేశ గురువు, కొత్తూరు బసవ లింగ స్వామీజీ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బళ్లారిరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సోమసముద్రం గ్రామ కొట్టూరు శంకర మఠంలో సిద్ధలింగ దేశ గురు పట్టాభిషేకం సందర్భంగా కొత్తూరు బసవ లింగేశ్వర మహాస్వామి నేతృత్వంలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గురువారం సిద్ధలింగ దేశ గురు పట్టాభిషేకం నిర్వహించిన సందర్భంగా రెండు వేల మందికిపైగా మహిళలకు ఒడినింపే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ దంపతులు, పంచాయతీ అధ్యక్షులు రాజేశ్వరి, సిద్ధలింగం, గ్రామ ప్రముఖులు, పలు గ్రామాల ప్రముఖులు హాజరయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత

సోమందేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్‌చేసి డ్రైవర్‌పై గురువారం కేసు నమోదుచేశారు. వివరాల్లోకెళితే ధర్మవరం నుంచి బెంగళూరుకు రేషన్ బియ్యంను తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వైఎస్ఆర్ సర్కిల్‌లో వాహనతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని అడ్డగించి డ్రైవర్ హరిను అరెస్ట్‌చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం చౌకడిపోలద్వారా పేదలకు సరఫరాచేసే పీడీఎఫ్ రైస్ పేదల వద్ద నుంచి సేకరించి అక్రమంగా బెంగళూరుకు తరలిస్తున్నట్లు తెలిపారు. నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పెనుకొండ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని పెనుకొండలోని రామమందిరం వీధికి చెందిన పద్మనాభరావు కుమారుడు కృష్ణారావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన ముత్యాలప్ప వద్ద పెనుకొండలోని పద్మనాభరావు కుమారుడు కృష్ణారావు డబ్బులు తీసుకుని భూమి అగ్రిమెంట్ చేసుకుని భూమి ఇతరులకు అమ్మేశాడని ముత్యాలప్ప కృష్ణారావు ఇంటివద్దకు వెళ్లి ప్రశ్నించాడు. అతను కులంపేరుతో దూషించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని ముత్యాలప్ప ఫిర్యాదు మేరకు కృష్ణారావు, భార్య లీలమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దైవచింతన అలవర్చుకోవాలి

● ఎలేరాంపుర హనుమంతనాథ స్వామీజీ

అగళి, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని కర్ణాటక రాష్ట్రం ఏలేరాంపుర హనుమంతనాథ స్వామీజీ సూచించారు. గురువారం అగళి మండలం రామాపురం గ్రామంలో నూతన రామదేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమంతనాథ స్వామీజీ, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుడు దైవానుగ్రహంతో జీవిస్తున్నాడన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకుని ధర్మమార్గంలో పయనించాలన్నారు. పురోహితుడు సుబ్బన్న శాస్త్రి పూజా కార్యక్రమాలను చేపట్టారు. భూమిపూజకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మహేంద్ర, రవికుమార్, స్థానికులు జయరామప్ప, నందీష్, లక్ష్మీ, నరసప్ప, శివానంద, సిమెంటు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వెన్నంపల్లిలో మారియమ్మ జాతర



గ్రామదేవతల వేషధారణతో ఊరేగింపు

హోసూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వెన్నంపల్లిలో 40 సంవత్సరాల తర్వాత గ్రామ దేవత మారియమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామదేవతలు మారియమ్మ, గంగమ్మ, కాళియమ్మ, కక్కుమరియమ్మన్ ఉత్సవమూర్తులను ఊరేగించారు. సూరంకుట్లై, ఎంటీవీ నగర్ తదితర ప్రాంతాలలో ఊరేగింపు సాగింది. పరమశివుడు, పార్వతీ దేవి, కాళికాదేవి, మరియమ్మన్, వెక్కలిమ్మన్, అంగళమ్మన్, మునియప్పన్ వంటి దేవతామూర్తుల వేషధారణలతో భక్తులు పాల్గొన్నారు. ఎండ వేడిమినుంచి ఉపశమనం కలిగించాలని, వర్షాలు సకాలంలో కురవాలని కోరుతూ పూజలు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. 40 ఏళ్ల తర్వాత జరిగిన మారియమ్మన్ జాతరతో గ్రామాల్లో సందడి నెలకొంది.



భూమిపూజలో మాజీ ఎంపీ మునుస్వామి తదితరులు

పాఠశాల నిర్మాణానికి భూమిపూజ

హోసూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లా వేపనపల్లి శాసనసభ నియోజకవర్గంలోని అంగొండపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తంగ్రై గ్రామంలో పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌కు భూమిపూజ చేశారు. అన్నా డీఎంకే డిప్యూటి జనరల్ సెక్రటరీ, మాజీ మంత్రి కేపీ మునుస్వామి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ కౌన్సిలర్ బాబు వెంకటాచలం, మాజీ యూనియన్ కౌన్సిలర్ మాతేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాసజ్ఞానం అర్కేటి, ఉపాధ్యాయులు అమరావతి, సుధారాణి, వెంకటరాజు, కళావతి, కాంట్రాక్టర్, మంజునాథ్, పంచాయతీ మాజీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల



కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): తాలూకాల్లోని గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల షెడ్యూల్‌ను కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా గురువారం విడుదల చేశారు. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ 14 అని, పరిశీలనకు 15న, నామినేషన్ల ఉపసంహరణకు 17 చివరి రోజు అన్నారు. 25న 25న ఓటింగ్ ఉంటుందన్నారు. ఉప ఎన్నికల ప్రక్రియ 28తో ముగుస్తుందన్నారు.

ఖాళీ అయిన స్థానాలు ఇవే...

కంప్లి తాలూకా దేవసముద్రం-1(జనరల్‌ఉమెన్), దేవలాపురం-1(జనరల్), సిరుగుప్ప తాలూకా రావిహాలు-1(షెడ్యూల్డ్ తెగ మహిళ) మొత్తం 6 పంచాయతీలకు ఉప ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సండూర్ తాలూకాలో సుగూర్-2(జనరల్,జనరల్ ఉమెన్), మెట్రిక్-1(షెడ్యూల్డ్ తెగ ఉమెన్) ఉన్నాయని తెలిపారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ్

కంప్లి, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని తాలుకా పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ్ సూచించారు. తాలుకాలోని హంపదేవనహళ్లి సమీపంలోని గుంటూరు క్యాంపు సరస్సు పూడికతీత పనుల స్థలంలో కూలీకి వెళ్దాంరా అభియాన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు ఎత్తిపోతల పథకం కింద అదనపు వేతనం అందజేస్తామన్నారు. ఈ పథకం పరిధిలోకి రాని కుటుంబాల సర్వే, అర్హులైన స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పిస్తామన్నారు. పథకంపై మహిళల్లో అవగాహన కల్పించి వారిని చురుగ్గా పాల్గొనేలా పథకంలో దూరమైన బలహీన కుటుంబాలను గుర్తించేందుకు ప్రచారం ముఖ్య ఉద్దేశమన్నారు. హనుమేష్, పంపాపతి, మంజుళతో పాటు మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

హత్యాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, మే 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని సదర్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన ఓ వ్యక్తి హత్యకు సంబంధించిన ఘటనా స్థలాన్ని గురువారం ఎస్పీ పుట్టమాదయ్య పరిశీలించారు. స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేయాలని సీఐ ఉమేశ్ కాంబ్లెను ఆదేశించారు.

ధర తగ్గిన ఉల్లి - నిరాశలో రైతు

చేళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా పరిధిలో అన్నదాతలు ఎగుమతి చేసే ఉల్లిని ఎక్కువగా పండిస్తున్నారు. ఇటీవలికాలంలో 60 కేజీల బస్తా రూ.3వేలు ధర పలికింది. దీంతో చాలామంది రైతులు పోటీ పడి ఉల్లిని సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చాక ఉల్లిధర ఆశించిన మేర పలకలేదు. కొన్నిరోజులుగా బస్తా రూ.800 మాత్రమే ఉంటోంది. ఆశించిన ధర లభించకపోవడం, ధర ఒక్కసారిగా పడిపోవడంతో అన్నదాతలు నిరాశకు లోనయ్యారు. దీంతో పొలాల వద్దనే ఉల్లిబస్తాలు నిల్వ చేశారు. మంచి ధర ఎప్పుడు కలుగుతుందా అని ఎదురుచూస్తున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ

మడకశిర టౌన్, మే8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ సూచించారు. తండా ప్రాంతాల్లో సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గం 2047 విజన్‌పై సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఏపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితరులతో సమావేశం నిర్వహించారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా పనిచేయాలని, గ్రామాల్లో సమస్యల పరిష్కరంపై దృష్టి పెట్టాలని పలుసూచనలు చేశారు. మండలస్థాయి విజన్‌లు సిద్ధం చేయడంపై సూచనలు చేశారు. అదేవిధంగా ఇల్లు మంజూరు అయిన వారికి త్వరితగతిన ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలని, పశువుల తొట్టెల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు సోనిబాయి, రామారావ్ తదితరులు పాల్గొన్నారు,

బాధ్యతల స్వీకరణ

పరిగి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ ఎంపీడీఓగా రెడ్డప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో తనకల్లులో ఏఓ పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు కృషిచేస్తానని ఎంపీడీఓ రెడ్డప్ప పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా వెంకటలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. శింగనమల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సోమందేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వడ్డె సూరీ, కిష్టప్ప, సూర్యనారాయణ, కార్యదర్శి రామాంజినేయులు, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గంగమ్మ, ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషిచేస్తానని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

న్యాయం చేయండి

పెనుకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులు ఉన్నా పంచాయతీ అధికారులు పేదలు నిర్మించుకున్న గుడిసెలను, షెడ్లను కూల్చివేశారని తమకు న్యాయం చేయాలని సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనపల్లికి చెందిన పేదలు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిని అందిస్తూ నల్గొండ్రాయనపల్లిలో సర్వే నంబరు 700లో గత మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని, రేకులషెడ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. గుడిసెలు తొలగించకుండా కోర్టు స్టే ఇచ్చిందన్నారు. అయినా పంచాయతీ అధికారులు లెక్కచేయకుండా పేదలు కట్టుకున్న ఇళ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారని, ఉన్నఫళంగా కూల్చివేయడంతో వారు నడిరోడ్డుపై పడ్డారన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్, సీపీఐ నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

హైజిన్ కిట్ల వితరణ

చిలమత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వికలాంగ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గురువారం హైజీన్ కిట్స్‌ని అందజేశారు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న సమర్థన ట్రస్టులో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కుమార్‌స్వామి రెడ్డి, కొడికొండ చెక్‌పోస్టు శివకుమార్, మొబలైజర్ రామాంజి విద్యార్థులకు కిట్స్‌ని అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

గోపాలకృష్ణ గోఖలే (జయంతి)



మొహమ్మద్ అలీ జిన్నా, మహాత్మాగాంధీలకు రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే 1866 మే 9న మహారాష్ట్ర రాష్ట్రం రత్నగిరి జిల్లా కొత్లుక్ గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, స మాజసేవకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. కళాశాల విద్యను అభ్యసించిన తొలితరం భారతీయుల్లో గోఖలే ప్రముఖులు. 1884లో ఎఫిన్‌స్టోన్ కళాశాలలో ఆంగ్లమాధ్యమంలో చదివారు. 1902 - 1915 వరకు భారత శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు. 1905లో సర్వెంట్స్ ఆఫ్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రజలలో జాతీయతాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. ఆయన పేరిట 1930లో పూనెలో గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ విద్యాలయం ఏర్పాటైంది. 1915 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ (వర్ధంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న తూర్పు గోదావరి జిల్లా రా జ మండ్రిలో జన్మించారు. స్వాతం త్ర్య సమరయోధురాలు, న్యాయవాది, సంఘసంస్కర్త, రాజ్యాంగ నిర్మాణసభ ఏకైక మహిళా సభ్యురాలు, ప్లానింగ్ కమిషన్ సభ్యురాలు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్‌కు తొలి చైర్‌పర్సన్. చెన్నై, హైదరాబాద్‌లలో ఉన్న ఆంధ్ర మహిళాసభలను ఈమె స్థాపించారు. ఈమె భర్త సీడీ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత రిజర్వుబ్యాంకు తొలి గవర్నర్. యునెస్కో అవార్డు, నెహ్రూ లిటరసీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 1981 మే 9న కన్నుమూశారు. కాగా మహిళా అభ్యున్నతికి పాటుపడే స్వచ్ఛంద సంస్థలకోసం ఆమె పేరిట కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు ఏటా ప్రత్యేక అవార్డు ఇస్తోంది.

విజయ్ దేవరకొండ (పుట్టినరోజు)



దేవరకొండ విజయ్ సాయి 1989 మే 9న హైదరాబాద్‌లో జన్మించారు. నాటకాల్లో బాగా రాణించిన విజయ్ సినిమాల్లోకి ప్రవేశించారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో కూడా చిన్నపాత్ర పోషించారు. 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో రిషి పాత్ర, 'పెళ్లి చూపులు' సినిమాలో హీరో పాత్రతో ప్రశంసలు అందుకున్నారు. 'అర్జున్ రెడ్డి'తో బాక్సాఫీస్ రికార్డు పొందారు. మహానటి, 'గీత గోవిందం' తదితర సినిమాలతో యూత్‌లో మంచి ఫాలోయింగ్ కలిగియున్నారు. సొంత ప్రొడక్షన్ కంపెనీ ఏర్పాటు చేసి 'మీకు మాత్రమే చెప్తా' సినిమా తీశారు. 2019లో ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు దక్కించుకున్నారు.

సాయి పల్లవి (పుట్టినరోజు)



సాయిపల్లవి సెంతామరై 1992 మే 9న తమిళనాడు రాష్ట్రం ఊటీ సమీపంలోని కొత్తగిరి గ్రామంలో జన్మించారు. నటి, నృత్యకారిణి. తెలుగు, తమిళ, మళయాళ సినిమాలలో పేరొందారు. మళయాళంలో 'ప్రేమమ్', తెలుగులో 'ఫిదా' సినిమాలతో గుర్తింపు పొందారు. రెండింటికీ ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. అమెరికాలో వైద్యవిద్యను పూర్తి చేశారు. 2020లో ఫోర్బ్స్ మేగజైన్‌లో ఇండియాలో '30 అండర్ 30' విభాగం జాబితాలో చోటు పొందారు. ఉత్తమ నటి, స్పెషల్ జ్యూరీ సహా ఇతర అవార్డులు కూడా అందుకున్నారు.

రాయలసీమ ద్రోహి.. జగన్

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతులకు వైఎస్ జగన్ తీరని ద్రోహం చేశారని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. హంద్రీనీవాపై వైసీపీ నేతల ఆరోపణలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి ఆయన గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. కరువు సీమకు హంద్రీనీవా ఓ వరం అన్నారు. వైసీపీ హయాంలో గంపెడు మట్టి కూడా తీయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారన్నారు. హంద్రీనీవా పనులు పూర్తి చేసి, రికార్డు సృష్టిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ పరిధిలోని అన్ని చెరువులు నింపి, రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు శుక్రవారం జిల్లాకు రానున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి


హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపి, ఆయకట్టుకు సాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని దేవాంగ కల్యాణమండపంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాలువలో 10వేల క్యూసెక్కులు పారిస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి, నీరు ఇచ్చినపుడే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కాలువ లైనింగ్ పనులతో రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. రెండో దశలో లైనింగ్ పనులు ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. మిర్చి పంట గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ల ప్రసాద్, శీనా, అబ్బాస్, రమేష్ పాల్గొన్నారు.

ఆ జీఓ రద్దు చేయాలి

హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలను కుదించే జీఓ 404, 405లను రద్దు చేయాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో ప్రతులను చూపుతూ నిరసన తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువను మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. ప్రధాన కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు, ప్రజాసంఘాల నాయకులు మధుసూదన్, కృష్ణమూర్తి, బాలరంగయ్య, రంగారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలకు నాఫెడ్ పురస్కారాలు



నాఫెడ్ ఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న బత్తలపల్లి రైతు, ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్

అనంతపురం అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్, సీఈఓలకు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ఉత్తమ పురస్కారాలను గురువారం ప్రదానం చేశారు. ఢిల్లీలోని నాఫెడ్ ప్రధాన కార్యాలయంలో ముదిగుబ్బ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఆవుల చంద్రమోహన్, సీఈఓ సతీష్, బత్తలపల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీఈఓ పవన్‌కు నాఫెడ్ ఎండీ దీపక్ అగర్వాల్ ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. ఎఫ్‌పీఓల నిర్వహణ, వ్యాపార లావాదేవీలు, ప్రభుత్వ, ఇతర సంస్థలతో అనుసంధానం తదితర అంశాల్లో ప్రగతి సాధించినందుకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ ఎఫ్‌పీఓలు ఎరువులు, పురుగు మందుల డీలర్‌షిప్ తీసుకుని, సరసమైన ధరలకు రైతులకు అందజేశాయి.



గాయపడిన వారిని స్ట్రెచర్‌పై ఇలా తరలిస్తామని..



బిల్డింగ్‌పై గాయపడి నడవలేని స్థితిలో ఉన్నవారిని తాడు సాయంతో కిందకు దించే ప్రక్రియ

యుద్ధం.. భద్రం..!

స్వీయరక్షణ, సహాయక చర్యలపై మాక్ డ్రిల్

ఆర్టీసీ బస్టాండులో నిర్వహించిన అధికారులు

అనంతపురం కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): యుద్ధవాతావరణం నేపథ్యంలో భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం బస్టాండులో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డీఆర్వో మలోల, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల జాబితాలో జిల్లా లేనప్పటికీ అంతర్గత భద్రత అవసరమని డీఆర్వో అన్నారు. యుద్ధ ప్రభావం ఈ ప్రాంతంపై పడితే ప్రభుత్వం ముందస్తుగా సైరన్ మోగిస్తుందని, ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శత్రుదేశాలవారు ప్రజల్లో కలిసిపోయి బాంబులు పెట్టే ప్రమాదం ఉందని, అనుమానాస్పదంగా ఏవైనా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రమాద సమయంలో స్వీయ భద్రతను పాటిస్తూనే తోటివారికి సాయపడాలని డీఎఫ్ఓ సూచించారు. పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య శాఖ ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లను ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులను వెంటనే నమ్మకుండా, వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని అన్నారు. ఆలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు, వైద్యశాఖ సిబ్బంది సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆపద సమయంలో ఎలా వ్యవహరించాలో చేసి చూపించారు. మాక్‌డ్రిల్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఓ కేపీ లింగమయ్య, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్, 108 జిల్లా మేనేజర్ తిరుపతి నాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్, బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి, ఎస్‌టీఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

గుంతకల్లుకు సాగు నీరివ్వండి..!

సీఎం చంద్రబాబుకు రైతుల వినతి

గుంతకల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కింద గుంతకల్లు నియోజకవర్గానికి అధికారికంగా ఆయకట్టును కేటాయించాలంటూ స్థానిక రైతులు కోరుతున్నారు. హంద్రీనీవా కాలువ జిల్లాలోకి ప్రవేశించేది గుంతకల్లు మండలంలోనే. అయినా, గుంతకల్లు నియోజకవర్గానికి ఆ ప్రాజెక్టు కింద ఆయకట్టే కేటాయించలేదని వారు వాపోతున్నారు. కళ్లెదుటే కాలువ నిండా నీరు వెళ్తున్నా, గుంతకల్లు నియోజకవర్గంలో ఒక ఎకరాకూ అధికారికంగా నీటిని వాడుకునే వీలు కల్పించలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఉరవకొండ నియోజకవర్గంలో ఛాయాపురం వద్ద హంద్రీనీవా సందర్శనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఇక్కడి రైతులు ఆయకట్టు విషయంగా వేడుకుంటున్నారు. గుంతకల్లు, గుత్తి మండలాలకు అధికారికంగా ఒక్క ఎకరాకూ ఏ ప్రాజెక్టు నుంచీ సాగునీరందడం లేదు. హంద్రీనీవా కాలువను ప్రారంభించేటపుడు 2013లో కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గానికి ఆయకట్టు కేటాయించకపోవడంతో అన్యాయం జరిగిందనీ, కనీసం హంద్రీనీవాను వెడల్పు చేస్తున్న సందర్భంగానైనా అధికారికంగా నీటి కేటాయింపు జరగాలని రైతులు కోరుకుంటున్నారు.

రెండు ప్రాజెక్టులున్నా..

గుంతకల్లు నియోజకవర్గంలో రెండు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు హంద్రీనీవా, గుత్తి సబ్‌బ్రాంచ్ కెనాల్ (జీఎస్‌బీసీ) ఉన్నా రైతులకు ఒరిగింది శూన్యం. జీఎస్‌బీసీ కింద 16,271 ఎకరాల అధికారిక ఆయకట్టు ఉన్నా జీబీసీ నుంచి చుక్కనీరు ఈ ప్రాజెక్టులోకి రావడంలేదు. హెచ్చెల్సీ నుంచి జీబీసీకే తక్కువ నీటి కోటా వస్తుండటంతో 15 ఏళ్లుగా గుత్తి, ఆలూరు బ్రాంచ్ కాలువలకు సాగునీరు రాకుండా నిలిచిపోయింది. 2013లో హంద్రీనీవా ప్రారంభం అయ్యాక అనధికారికంగా ఈ బ్రాంచ్ కాలువలకు కొద్దిపాటి నీటిని విడుదల చేస్తున్నారు. హంద్రీనీవా నుంచి కూడా గుంతకల్లు నియోజకవర్గంలో ఎకరా ఆకయట్టు కూడా లభించకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. కాలువ వెడల్పు, లైనింగ్ జరిగిందంటే టెయిల్ ఎండ్‌కు నీటిని తీసుకెళ్లడానికి అంటూ హంద్రీనీవా నీటిని బీఎస్‌బీసీకి వదలకుండా మొండిచేయి చూపుతారంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ రెండింటికీ గ్రీన్ సిగ్నల్ కావాలి

వజ్రకరూరు మండలం రాగులపాటు వద్ద నుంచి తూమును ఏర్పాటుచేసి గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు నీరందించే ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే జయరాం కూడా ఆ ప్రాజెక్టు విషయంగా ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖామంత్రి వద్ద గట్టి ప్రయత్నం చేస్తున్నారు. 2017లో పామిడి సభలో చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. తప్పక సాకారం అవుతుందని భావిస్తున్నారు. కాగా జీఎస్‌బీసీకి హెచ్చెల్సీ నీరు లభించే అవకాశం అడుగంటినందున, హంద్రీనీవా నుంచి గ్రావిటీ కింద సాగునీరందించే అవకాశం ఉంది. ఈ విషయంగా కూడా ప్రతిపాదన ఉండగా, దానిని ఆమోదిస్తే నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలల్లోని 16,271 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని సీఎంకు రైతులు విన్నవించుకుంటున్నారు.

ఆయకట్టు కోసం ఎదురుచూపు

ఉరవకొండ: హంద్రీనీవా ఆయకట్టు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేస్తారని రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రధాన కాలువపై మాత్రమే దృష్టి సారించారు. పిల్లకాలువలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతిపక్ష హోదాలో జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మారిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. 2017 ఫిబ్రవరిలో ఉరవకొండలో జరిగిన మహాధర్నాలో జగన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తిచేసి, ఆయకట్టుకు నీరు అందిస్తామన్నారు. హంద్రీనీవా కాలువపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ నిర్లక్ష్యం ప్రదర్శించింది. కనీసం కాలువలో గంపెడు మట్టి కూడా తీయలేదు. సాగునీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. తవ్విన పిల్లకాలువలో కూడా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో కాలువ రూపురేఖలే మారిపోయాయి. కృష్ణాజలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు 1989లో హంద్రీనీవా పథకానికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు కృష్ణా జలాలు తరలించాలన్నదే ప్రధాన ఉద్దేశం. 2019 వరకూ పనిచేసిన ప్రభుత్వాలు పథకం పనలను ముందుకు తీసుకెళ్లాయి. హంద్రీనీవాకు సంబంధించిన పనులు 2012లోనే 95శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటినుంచి ప్రధాన కాలువకు నీరు ప్రవహిస్తోంది. నీరు ప్రవహిస్తున్నా కాలువ నుంచి ఆయకట్టుకు ఉపయోగించుకోలేని పరిస్థితి. ప్రధాన కారణం హంద్రీనీవా కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాకపోవడమే. 33, 34, 36 ప్యాకేజీల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు కూడా చేపట్టారు. 33, 34 ప్యాకేజీల్లో 90 శాతం పనులు గతంలోనే పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టులు, అక్విడెక్టుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. 2 నుంచి 3 శాతం పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగు కూడా వేయలేదు. 36వ ప్యాకేజీలో 18శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 25శాతం కంటే తక్కువ పూర్తయిన పనులను రద్దు చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. లోటుపాట్లు లేకుండా పర్యటనను జయప్రదం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ శర్మ, ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. సీఎం భద్రత అధికారి చంద్రశేఖర్‌తో కలసి బందోబస్తుపై పోలీసు అధికారులకు ఆమె గురువారం దిశానిర్దేశం చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వై జంక్షన్ నుంచి ముఖ్య ప్రజాప్రతినిధుల వాహనాలను మాత్రమే ఎయిర్‌పోర్టు వరకు అనుమంతించాలని సూచించారు. ప్రధాన ద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, విమానాశ్రయంలోకి పంపాలని సూచించారు. కలెక్టర్ మంజూరు చేసిన జాబితాలో పేర్లు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. సమీక్షలో డీఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- ముఖ్యమంత్రి పర్యటనకు ముగ్గురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్ 99 మంది, పీసీలు 114 మంది, మహిళా పోలీసులు 36 మంది, హోంగార్డు 65 మంది, మూడు స్పెషల్‌పార్టీ బృందాలు, మూడు ఏఆర్ టీంలతో భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య/క్లాక్‌టవర్, మే 8(ఆంధ్రజ్యోతి): మోడల్ డీఎస్సీ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ పరీక్షల పోస్టర్లను డీఈఓ ఆఫీస్‌లో ప్రసాద్‌బాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సొసైటీ అధ్యక్షుడు రమేష్ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ.. ఈనెల 24న డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మోడల్ డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇవి ఉపయోగపడతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీలోగా స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని 13-186 డోర్ నంబర్‌లోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లోగానీ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9059055965 నంబరులో సంప్రదించాలని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్ తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, జేఎల్ మురళి

గుర్తుతెలియని వృద్ధుడి అనుమానాస్పద మృతి

గార్లదిన్నె, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపాన ఓ గుట్టలో గుర్తుతెలియని వృద్ధుడు (60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కనుంపల్లి సమీపంలోని గుట్ట నుంచి దుర్వాసన వస్తుండడంతో అటువైపు వెళ్లిన పశువుల కాపర్లు వెళ్లి చూశాడు. వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు అంచనా వేశారు. మృతుడు తెల్లటి షర్టు, తెల్లటి పంచె, తెల్లటి బనియన్, ఎర్రటి డ్రాయర్ ధరించి ఉనాడుఉ. రైతు ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పక్కన కూల్‌డ్రింక్ బాటిల్, పురుగు మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలి మృతి



పెద్దక్క(ఫైల్)

బత్తలపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన పెద్దక్క (76) ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి గురువారం మృతిచెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓబులేసు భార్య పెద్దక్క బుధవారం గ్రామంలోకి స్టోర్ బియ్యం తెచ్చుకునేందుకు వరసకు మనవడు అయ్యే హరీష్ బైక్‌లో బయల్దేరింది. మార్గమధ్యలో పెద్దక్కకు కళ్లు తిరిగి కింద పడి గాయపడింది. వెంటనే పెద్దక్కను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పెద్దక్క కుమారుడు పున్నప్ప ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఆత్మహత్య



రామనాథరెడ్డి(ఫైల్)

తాడిపత్రి, మే8(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కాలనీకి చెందిన వడ్డీ వ్యాపారి రామనాథ్ రెడ్డి (50) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామనాథరెడ్డి వడ్డీలకు ఇచ్చిన రుణాలు సకాలంలో వసూలు కాకపోవడంతో మనస్తాపం చెందాడు. పట్టణంలోని గురు లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని, పురుగుల మందు తాగాడు. గమనించిన లాడ్జి సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామనాథ్‌రెడ్డి మృతిచెందాడు. అతడికి భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు రవితేజారెడ్డి, కుమార్తె వందన ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

మళ్లీ సైన్యంలో చేరతా..

బీఎస్ఎఫ్ మాజీ జవాను ఆసక్తి

చెన్నేకొత్తపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో దేశరక్షణ కోసం తిరిగి సైనిక సేవలందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని బీఎస్ఎఫ్ మాజీ జవాను వడ్డే శీనప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తన గృహంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎఫ్‌లో 24 ఏళ్లపాటు పనిచేశానన్నారు. అందులో 21 ఏళ్లు పాకిస్థాన్ సరిహద్దులో విధులు నిర్వహించానన్నారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా గతేడాది బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ హోదాలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశానన్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తిరిగి విధుల్లోకి చేరి సేవలందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుని, వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన.. ప్రభుత్వాన్ని కోరారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరు బీహార్‌వాసుల మృతి

పెనుకొండ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం కల్లుకుంట సమీపంలో బాట సుంకలమ్మ ఆలయం వద్ద గురువారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని బిహార్‌కు చెందిన రాహుల్ (20), మహమ్మద్ సుభాన్ (30) మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మహమ్మద్ సుభాన్ పెద్దగోళ్లపల్లి ఎస్టేట్‌లో పనిచేస్తున్నాడు. తన కుమారుడితో కలిసి రొద్దం వెళ్లి, తిరిగి వస్తుండగా, రాహుల్, అఫ్సాన్ ఎదురుగా మరో బైక్‌పై వచ్చారు. రెండు బైకులూ వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రాహుల్, మహమ్మద్ సుభాన్ అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన అఫ్సాన్‌తోపాటు సుభాన్ కుమారుడిని 108 వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. మృతదేహాలను పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. రొద్దం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వెబ్‌లో మార్కుల జాబితాలు

అనంతపురం విద్య, మే 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మార్కుల మెమోలు శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం తెలిపారు. అన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్స్ ద్వారా ఎస్ఎస్‌సీ బోర్డ్ వెబ్‌సైట్ నుంచి మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసి, సంతకాలు చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మార్కుల మెమోల్లో ఏవైనా తప్పులు దొర్లినట్లు హెచ్ఎంలు, తల్లిదండ్రులు గుర్తిస్తే.. వెంటనే స్కూల్‌లోని విద్యార్థి రికార్డులు, మార్కుల మెమో జిరాక్స్ కాపీలను జత పరిచి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమాచారాన్ని ఆలస్యం చేయకుండా, ఈనెల 25వ తేదీలోగా డైరెక్టర్‌కు పంపాలని సూచించారు.

'జీవవైవిధ్యం' అవార్డులకు 13లోగా ఎంట్రీలు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 'ప్రకృతితో సామరస్యం.. స్థిరమైన అభివృద్ధి' అనే అంశంతో ఈనెల 22న అమరావతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు, బహుమతుల కోసం వివిధ విభాగాల్లో ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, సభ్య కార్యదర్శి పి. రామకృష్ణ గురువారం తెలిపారు. జీవవైవిధ్యంలో సాధించిన విజయాలు, సంబంధిత పేపర్ కటింగ్‌లు, ఫోటోలను 'రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డ్, ప్లాట్ నంబరు 209, వాల్నట్ బ్లాక్, రెయిన్ ట్రీపార్కు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా, గుంటూరు జిల్లా-522508' చిరునామాకు ఈ నెల 13లోపు పంపాలని సూచించారు.

సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

అనంతపురం క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుపై పోస్టులు పెట్టినందుకు మారుతీ కుమార్ పై గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫేస్‌బుక్‌లో మారుతీకుమార్ ఐడీ పేరుతో సీఎంను ఉద్దేశించి ఒక పోస్టు, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, చంద్రబాబు ఫొటోలు పెట్టి మరో పోస్టులో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది అని పెట్టాడు. కార్తీక్ ఐడీ పేరుతో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి కార్యకర్తలు తరలి రండి అనే పోస్టులో మారుతీ కుమార్ రక్తచరిత్ర-2గా కామెంట్ చేశాడు. ఈ పోస్టులపై అనంతపురం టీడీపీ అర్బన్ ఎస్సీ సెల్ కార్యదర్శి మన్నల నాగార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.